జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక
హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 113 ॥ శుక్రవారం ॥ 18-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

18 సెప్టెంబర్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:08 సూర్యాస్తమయం - సా. 6:12 తిథి సప్తమి మ. 1:02 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం జ్యేష్ఠ రా. 10:38 వరకు తరువాత మూల యోగం ప్రీతి మ. 1:34 వరకు కరణం వనిజ మ. 1:02 వరకు విష్టి రా. 2:13o వరకు వర్జ్యం లేదు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:21 వరకు రాహుకాలం ఉ. 10:39 నుండి మ. 12:10 వరకు యమగండం మ. 3:11 నుండి సా. 4:41 వరకు గుళికాకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:32 నుండి తె. 5:20 వరకు అమృత ఘడియలు మ. 12:53 నుండి మ. 2:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:34 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# అమరుల త్యాగాలకు గౌరవ వందనం

**అమరవీరులకు నివాళులర్పించిన రేవంత్ రెడ్డి**

**ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కార్యక్రమం**

**గన్ పార్క్ వద్ద ఘన నివాళులు.. ఉద్యమ స్ఫూర్తి స్మరణ**



తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 17: తెలంగాణ ఉద్యమ చరిత్రలో అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వారి పోరాట ఫలితంగానే తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాయని తెలిపా రు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచే స్తోందని చెప్పారు. ప్రజా పాలన దినోత్సవం తరువాయి 2 వ పేజీలో..



## పాఠశాలలను సందర్శించిన భట్టి విక్రమార్క

**ఆప్యాయంగా ముచ్చటించిన ఉప ముఖ్యమంత్రి**

**విద్యా ప్రమాణాలు, వసతులపై విద్యార్థులతో ఆరా**

ఖమ్మం, సెప్టెంబర్ 17 : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వనం వారి కృష్ణాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. పాఠశాలలో విద్యా పరిస్థితులు, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. విద్యార్థులు బాగా చదువుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత తరువాయి 2 వ పేజీలో..



## సెమికాన్ ఇండియా 2026కు మోదీ శ్రీకారం

**న్యూఢిల్లీలో సెమికాన్ ఇండియా 2026 ప్రారంభం**

**సెమీకండక్టర్ రంగంలో స్వావలంబన లక్ష్యంగా అడుగులు**

**దేశీయ సరఫరా వ్యవస్థ బలోపేతంపై దృష్టి**

## వేగంగా పోలవరం పనులు

**ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు**

**ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ పురోగతిపై సమీక్ష**



పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ విభాగాల్లో కొనసాగుతున్న నిర్మాణ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.



## కాశీ విశ్వనాథుని దర్శించిన చంద్రబాబు

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి**

**పవిత్ర జలాలతో అభిషేకం చేసిన నేతలు**

**ఆలయ పండితుల వేద ఆశీర్వచనం**

పవిత్ర పుణ్యక్షేత్రమైన వారణాసిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం కాశీ విశ్వనాథ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సంప్రదాయబద్ధంగా జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన కాశీ విశ్వనాథునికి పవిత్ర జలాలతో అభిషేకం చేశారు.



వారణాసి, సెప్టెంబర్ 17: దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తుల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, ముఖ్యమంత్రి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఆలయ దర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖ నాయకులు కలిసి తరువాయి 2 వ పేజీలో...



## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్

**ప్రధాని జన్మదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం**

**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ**

**రక్తదానం గొప్ప మానవతా సేవ అన్న గవర్నర్**

**దాతలను సత్కరించి ప్రశంసా పత్రాల అందజేత**

హైదరాబాద్, సెప్టెంబర్ 17: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తరువాయి 2 వ పేజీలో..

## నేటి రాశి ఫలాలు

మేషం: నూతన విద్యవకాశాలు లభిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. గృహ నిర్మాణ ఆటంకాలు తొలగుతాయి. ఆర్థికంగా అభివృద్ధి కలుగుతుంది. ప్రయాణాలు కలసివస్తాయి. వృత్తి, వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో ఆటంకాలు కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆప్తులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. మిత్రులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగమున కొంత నిరుత్సాహం తప్పదు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

మిధునం: దీర్ఘకాలిక ఋణాలు కొంతవరకు తీర్చగలరు. ఆరోగ్యపరమైన సమస్యలు చికాకు కలిగిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు శ్రమాధిక్యతతో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యుల సహాయం లభిస్తుంది. ఉద్యోగపరంగా వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. స్వల్ప ధనప్రాప్తి కలుగుతుంది.

కర్కాటకం: ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు లాభిస్తాయి. బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన ఉద్యోగ లబ్ది. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. కుటుంబ సభ్యులతో విందువినోదాల కార్యక్రమాల్లో పాల్గొంటారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

సింహం: ఉద్యోగ వ్యవహారాలలో తలపెట్టిన పనులు సకాలంలో పూర్తి చేసి పైవారి నుండి ప్రశంసలు పొందుతారు. గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. దూరప్రాంతాల వారి నుండి విలువైన సమాచారాన్ని సేకరిస్తారు. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు పెట్టి లాభాలు పొందుతారు.

కన్య: సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కలసి వస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో మీరు తీసుకున్న నిర్ణయాల వలన లాభం పొందుతారు. ధనాదాయం బాగుంటుంది. అనారోగ్య సూచనలున్నవి. ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి. బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

తుల: వృత్తి ఉద్యోగ విషయమై కీలక సమాచారాన్ని సేకరిస్తారు. ఆరోగ్య విషయాలలో జాగ్రత్తగా ఉండాలి. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయగలుగుతారు. వృత్తి వ్యాపారాలు పరంగా నష్టాల ఊబి నుండి బయటపడతారు. గృహమున బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది.

వృశ్చికం: అన్ని రంగాల వారికి అనుకూల వాతావరణం ఉంటుంది. నూతన ఉద్యోగ లాభం కలుగుతుంది. ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి. వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు విస్తరిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గృహంలో శుభకార్యాలు నిర్వహిస్తారు.

ధనస్సు: వ్యాపార పరంగా ఇబ్బందులు తొలగుతాయి. ధన విషయాలలో కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. చిన్ననాటి మిత్రులతో దూరప్రాంత ప్రయాణాలు చేస్తారు.

మకరం: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు స్వీకరించడం మంచిది. ఋణ బాధలు తొలగుతాయి. భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యల నుండి బయట పడగలుగుతారు.

కుంభం: సంతానమునకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుతాయి. వాహన కొనుగోలు చేస్తారు. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. సోదరుల సహాయ సహకారాలు పొందుతారు. వ్యాపారం వృద్ధి చెందుతుంది.

మీనం: ప్రయాణాలలో మార్గావరోధాలు కలుగుతాయి. చేతిలో డబ్బు నిల్వ ఉండదు. నేత్ర సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగ విషయమై అనాలోచిత నిర్ణయాలు తీసుకుని ఇబ్బంది పడతారు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. బంధువుల నుండి విమర్శలు ఎదురవుతాయి.



# కాశీ విశ్వనాథుని దర్శించిన చంద్రబాబు

**మొదటి పేజీ తరువాయి**

కాశీ విశ్వనాథునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాల్లో ప్రత్యేక సందడి నెలకొంది. ఆలయ అధికారులు, పండితులు సంప్రదాయ పద్ధతుల్లో వారికి స్వాగతం పలికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అభిషేకం అనంతరం ఆలయ పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ శ్రేయస్సు, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ తీర్థ ప్రసాదాలను నాయకులకు అందజేసి సన్మానించారు. ఆలయ సంప్రదాయాలను వివరించిన పండితులు కాశీ క్షేత్ర విశిష్టతను కూడా వివరించినట్లు సమాచారం. వారణాసి భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు కేంద్రబిందువుగా నిలిచిన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు కాశీ విశ్వనాథుని దర్శించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రముఖ రాజకీయ నాయకుల దర్శనం స్థానికంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను అధికారులు కట్టుదిట్టం చేశారు.

ఆలయ దర్శనం అనంతరం చంద్రబాబు నాయుడు వారణాసిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలకు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రయాణాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సేవా యాత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన అక్కడికి చేరుకున్నారు. దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రజా సేవా కార్యక్రమాలను సమన్వయం చేస్తూ జరిగిన ఈ పర్యటన రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాశీ విశ్వనాథుని దర్శనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమాలు వారణాసిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సేవా భావనకు ప్రాధాన్యతనిచ్చే సందేశంతో ఈ పర్యటన కొనసాగిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్



**మొదటి పేజీ తరువాయి**

గవర్నర్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. సమాజంలో సేవా కార్యక్రమాల పట్ల మరింత చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రక్తదానం మానవతా సేవలో అత్యంత గొప్పదైన సేవలో ఒకటని గవర్నర్ అన్నారు. వైద్య శాస్త్రం ఎన్నో రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ రక్తానికి ప్రత్యామ్నాయం ఇప్పటికీ అందుబాటులో లేదని గుర్తుచేశారు. అత్యవసర పరిస్థితుల్లో, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, వివిధ వ్యాధుల చికిత్స సమయంలో రక్తం ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అందువల్ల ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం లభిస్తుందని గవర్నర్ తెలిపారు. సమాజంలో స్వచ్ఛంద రక్తదాన సంస్కృతి మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. యువత ముఖ్యంగా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో రక్త నిల్వలను పెంచి అవసరమైన వారికి సకాలంలో అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారిని సత్కరించి పండ్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సమాజానికి సేవ చేస్తున్న దాతలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. రక్తదానంతో ఎన్నో ప్రాణాలకు ఆశాకిరణంగా మారుతున్నారని అన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని అన్నారు. రక్తదాన శిబిరాల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అవసరమైన రక్తం అందుబాటులో ఉండే అవకాశం పెరుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం సేవా భావనను ప్రతిబింబించిందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ప్రజలు పెద్ద సంఖ్యలో రక్తదానానికి ముందుకు వచ్చి మరింత మంది ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, స్వచ్ఛంద దాతలు పాల్గొన్నారు. రక్తదాన శిబిరం విజయవంతంగా కొనసాగగా, సేవా కార్యక్రమాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని నిర్వాహకులు తెలిపారు.

# అమరుల త్యాగాలకు గౌరవ వందనం

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణ చరిత్రలో ప్రత్యేకమైన రోజని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కుల పరిరక్షణకు ఈ రోజు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. అమరవీరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని అన్నారు. గన్ పార్క్ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను కొనియాడారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.



అమరవీరుల కుటుంబాల త్యాగాలను రాష్ట్రం ఎప్పటికీ మరువదని ముఖ్యమంత్రి అన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని పిలుపునిచ్చారు. ప్రజా పాలన దినోత్సవ వేడుకలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి కొనసాగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణను మరింత ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# వేగంగా పోలవరం పనులు

**పోలవరం, సెప్టెంబర్ 17 :**

నిర్మాణ ప్రక్రియలో అవసరమైన సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని మంత్రి సూచించారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఆ లక్ష్య సాధన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తయితే సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి రంగాలకు గణనీయమైన ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా రూ.536 కోట్ల వ్యయంతో కుడి, ఎడమ గట్ల అనుసంధాన పనులు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. భారీ స్థాయిలో జరుగుతున్న ఈ పనులు ప్రాజెక్టు నిర్మాణంలో కీలక భాగమని వివరించారు. నిర్మాణ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు కొనసాగించాలని మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భూసేకరణ, పునరావాస కార్యక్రమాలపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. 2024 జూన్ తర్వాత 10,491 ఎకరాల భూమిని సేకరించినట్లు అధికారులు వివరించారు. నిర్వాసితులకు రూ.2,250 కోట్ల పరిహారం అందించినట్లు తెలిపారు. పునరావాస కార్యక్రమాలు సక్రమంగా అమలు అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణం, భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

# సెమికాన్ ఇండియా 2026కు మోదీ శ్రీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం న్యూఢిల్లీ లో సెమికాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, సాంకేతిక నిపుణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావిస్తూ, దేశాన్ని ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. సాంకేతిక రంగ భవిష్యత్తును నిర్దేశించే వేదికగా సెమికాన్ ఇండియా నిలుస్తోందన్నారు. సెమికాన్ ఇండియా కార్యక్రమం 2022లో ప్రారంభమైనప్పటి నుంచి సాధించిన పురోగతిని మోదీ వివరించారు. ప్రారంభ దశలో విధానాల రూపకల్పనతో మొదలైన ప్రయాణం, అనంతరం ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రయోగాత్మక ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, ప్రస్తుతం వాణిజ్య ఉత్పత్తి దశకు చేరుకుందని చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ తయారీకి అవసరమైన పునాదులు వేగంగా బలపడుతున్నాయని పేర్కొన్నారు. ఇది భారత సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. సెమీకండక్టర్ వ్యవస్థ నిర్మాణం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. చిప్ రూపకల్పన, తయారీ పరికరాల అభివృద్ధి, పరీక్షా సామర్థ్యాల నిర్మాణం వంటి అంశాల్లో అనేక రంగాల సమన్వయం అవసరమని చెప్పారు. తక్కువ సమయంలో ఈ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు చేసిన కృషిని అభినందించారు. ఈ సహకారంతో భారత్ వేగంగా ముందుకు సాగుతోందన్నారు. దేశీయ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మోదీ నొక్కి చెప్పారు.

# పాఠశాలలను సందర్శించిన భట్టి విక్రమార్క

**మొదటి పేజీ తరువాయి**

స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, పాఠశాల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా అత్యుత్తమ విద్యా అవకాశాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణల వల్ల ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు. పాఠశాలలో అమలవుతున్న ఉదయం అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకాలపై భట్టి విక్రమార్క విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, పరిమాణం గురించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం రుచికరంగా, నాణ్యంగా అందుతున్నాయని విద్యార్థులు తెలిపినట్లు సమాచారం. విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభ్యాసం మెరుగుపడుతుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడి కొరత ఉందని విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన భట్టి విక్రమార్క గణిత ఉపాధ్యాయుడిని నియమించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో బోధనా సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం మధిర నియోజకవర్గంలో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పనులపై ఉప ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, భూసేకరణ, నిర్మాణ ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన విద్యా సంస్థలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణ పనులు నవంబర్ మొదటి వారంలోగా ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో జాప్యం లేకుండా సమయపాలనతో ముందుకు సాగాలని సూచించారు.

# శ్వేత సంపాదకీయం

**శుక్రవారం 18-9-2026**

## భూగర్భ జలాలు వేగంగా క్షీణిస్తున్నాయి

నీరు లేకుండా జీవం లేదు. మానవ మనుగడ నుంచి వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి వరకు ప్రతి రంగం నీటిపైనే ఆధారపడి ఉంది. అలాంటి నీటి వనరులు నేడు ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు సమృద్ధిగా కనిపించిన నదులు, చెరువులు, భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోతుండటంతో భవిష్యత్తులో నీటి సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం కనిపిస్తోంది. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పులు ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. భారతదేశం వంటి వ్యవసాయాధారిత దేశంలో నీటి ప్రాధాన్యం మరింత ఎక్కువ. దేశంలోని అనేక ప్రాంతాలు ఇప్పటికే తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. వేసవి కాలం ప్రారంభమైతే గ్రామాలు, పట్టణాల్లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు సాధారణమవుతున్నాయి. భూగర్భ జలాలపై అధిక ఆధారపడటం వల్ల అనేక ప్రాంతాల్లో నీటి మట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. ఒకసారి భూగర్భ జలాలు తగ్గిపోతే వాటిని పునరుద్ధరించడం చాలా కష్టమైన ప్రక్రియ.

వాతావరణ మార్పులు కూడా నీటి సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. వర్షపాతం సరళిలో వస్తున్న మార్పులు, అనిశ్చిత వర్షాలు, వరదలు, కరువు పరిస్థితులు జల వనరులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ఒకవైపు కొన్ని ప్రాంతాలు భారీ వర్షాలతో ముంపునకు గురవుతుంటే, మరోవైపు అనేక ప్రాంతాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ప్రకృతి సమతుల్యతలో వస్తున్న ఈ మార్పులు భవిష్యత్తులో నీటి లభ్యతపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. నీటి కాలుష్యం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. పరిశ్రమల వ్యర్థాలు, మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు నదులు, చెరువులు, భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. ఫలితంగా అందుబాటులో ఉన్న నీటిలో కూడా వినియోగానికి అనువైన నీటి పరిమాణం తగ్గిపోతోంది. నీటి వనరులను కాపాడుకోవడం అంటే కేవలం నీటిని ఆదా చేయడం మాత్రమే కాదు, వాటి నాణ్యతను కూడా పరిరక్షించడం.

పట్టణాల విస్తరణతో చెరువులు, కుంటలు, వాగులు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు వర్షపు నీటిని నిల్వ చేసిన సహజ వనరులు నేడు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీనివల్ల భూగర్భ జలాల పునరుద్ధరణ తగ్గిపోతోంది. చెరువులు, సరస్సులు కేవలం నీటి నిల్వ కేంద్రాలు మాత్రమే కాదు, స్థానిక పర్యావరణ వ్యవస్థకు ఆధార స్తంభాలు కూడా. వాటి పరిరక్షణ లేకుండా జల భద్రతను ఊహించడం కష్టం. వ్యవసాయ రంగంలో కూడా నీటి వినియోగంపై పునరాలోచన అవసరం. అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు, సంప్రదాయ నీటిపారుదల పద్ధతులు నీటి వినియోగాన్ని పెంచుతున్నాయి. సూక్ష్మ నీటిపారుదల, వర్షపు నీటి సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ వంటి చర్యలను విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రైతులు, ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు కలిసి పనిచేస్తేనే ఈ సవాలును ఎదుర్కోవచ్చు.

నీటి సంక్షోభాన్ని నివారించడంలో ప్రభుత్వాల పాత్ర కీలకమైనదే అయినప్పటికీ ప్రజల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమైనది. ఇంటి స్థాయిలో నీటి వృథాను తగ్గించడం, వర్షపు నీటిని సేకరించడం, చెరువుల పరిరక్షణలో పాల్గొనడం వంటి చర్యలు పెద్ద మార్పుకు దారితీస్తాయి. నీటి వినియోగంలో బాధ్యతాయుత ధోరణి అలవర్చుకోవడం కాలానుగుణ అవసరంగా మారింది. జల వనరుల నిర్వహణలో సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉంది. నీటి నాణ్యత పర్యవేక్షణ, భూగర్భ జలాల అంచనా, వర్షపాతం విశ్లేషణ వంటి అంశాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతోంది. శాస్త్రీయ ప్రణాళికలు, ఖచ్చితమైన సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే జల వనరులను మరింత సమర్థంగా నిర్వహించవచ్చు.

నీటి సంక్షోభం అనేది కేవలం భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదం మాత్రమే కాదు, ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న వాస్తవం. ప్రస్తుతం తీసుకునే నిర్ణయాలే రాబోయే తరాల జల భద్రతను నిర్ణయిస్తాయి. నీటిని అపరిమిత వనరుగా కాకుండా అమూల్యమైన సహజ సంపదగా గుర్తించి సంరక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవం సందర్భంగా నీటి ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. జల వనరుల పరిరక్షణ, నీటి నాణ్యత సంరక్షణ, బాధ్యతాయుత వినియోగం అనే మూడు సూత్రాలను పాటించినప్పుడే భవిష్యత్తు నీటి సంక్షోభాన్ని నివారించగలం. నీటిని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమే అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.



## చర్లపల్లి రైల్వే స్టేషన్ లో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు



చర్లపల్లి, సెప్టెంబర్ 17: : భారతీయ జనతా పార్టీ చర్లపల్లి డివిజన్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ఆశీర్వాద దీపం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద జ్యోతులు వెలిగించి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి ముద్దుబిడ్డగా, ప్రపంచం మెచ్చిన నేతగా నరేంద్ర మోడీ ఎదగడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. నేను భారతీయుదినని చెప్పుకునే విధంగా నరేంద్ర మోడీ దేశాన్ని పాలించాడని, దేశాన్ని ప్రపంచంలోనే నాలుగో శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాడని ఆకాశానికెత్తారు.

ఈ దేశానికి నరేంద్ర మోడీ చేసిన సేవలు చిరకాలం సూర్యచంద్రులు ఉన్నంత కాలం గుర్తు ఉంటాయన్నారు. నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా దీపాలు వెలిగించి శుభాకాంక్షలు తెలిపిన మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. నరేంద్ర మోడీ మరో 25 సంవత్సరాల పాటు ఈ దేశాన్ని పరిపాలించాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు జీవించాలని మహేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. నిజాం నిరంకుశ పాలనను ఆపరేషన్ పోలో పోలీస్ చర్య ద్వారా అంతమొందించి భారత్ యూనియన్ లో సెప్టెంబర్ 17, 1948 రోజున అప్పటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ విలీనం గావించారని, తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్రం పురస్కరించుకొని ఆనాటి వీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పుల్లారావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అర్బన్ అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, చర్లపల్లి డివిజన్ మాజీ అధ్యక్షుడు డి.నాదం, డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, శైలేష్ రెడ్డి, తాళ్ల ఆనంద్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, రమేష్ యాదవ్, రమేష్ చౌదరి, జహంగీర్ బుగ్గ, సందీప్ యాదవ్, లక్ష్మీనారాయణ, రాంబాబు, మహిళలు కళావతి, చంద్రకళ, నాగమణి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు





## దివ్యాంగులతో కలిసి ఎంపీ ఈటెల సేవా సంకల్ప అభియాన్...

సికింద్రాబాద్, సెప్టెంబర్ 17 : భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని...సేవా సంకల్ప అభియాన్లో భాగంగా సికింద్రాబాద్‌లోని జాతీయ మానసిక దివ్యాంగుల సంస్థలో దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని దివ్యాంగులకు సహాయ పరికరాలను పంపిణీ చేశారు.

## కాప్రా ప్రెస్ క్లబ్‌లో గణనాధునికి ప్రత్యేక పూజలు



ఏఎస్ రావునగర్, సెప్టెంబర్ 17:: కాప్రా ప్రెస్ క్లబ్ లో ప్రతిష్ఠించిన గణనాధునికి గురువారం నాలుగవ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కె. సీతారాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్‌లో వరుసగా రెండవ సంవత్సరం గణనాధుని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు తెలియజేయడమే కాకుండా, ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావడం ప్రశంసనీయమని అన్నారు. గణనాథుని ఆశీస్సులతో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదర భావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజంలో సానుకూల మార్పుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు, భక్తులు పాల్గొని గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## బోయిన్పల్లి మార్కెట్లో షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ

కంటోన్మెంట్, సెప్టెంబర్ 17 (స్టార్ న్యూస్) : బోయిన్ పల్లి వ్యవసాయ మార్కెట్ లో నూతనంగా నిర్మించబోయే (జీం1) షాపింగ్ కాంప్లెక్స్ కు భూమి పూజ చేసిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ గారు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ ఎన్. శ్రీ గణేష్ గారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యులు శ్రీమతి బానుక నర్మద మల్లికార్జున్ గారు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ ఆర్. ఆనంద్ బాబు గారు, కమిటీ వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ యార్డ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





# కెనడా వేదికపై జిల్లా కీర్తి చాటేందుకు సిద్ధం..

## జిల్లా క్రీడాకారుని అంతర్జాతీయ లక్ష్యానికి పీ4 అండ.. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చొరవతో మార్గదర్శి ద్వారా ఆర్థిక సాయం

కెనడాలో జరగనున్న కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపికైన జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన క్రీడాకారుడు సంకు కృపారావు అంతర్జాతీయ వేదికపై మరోసారి పతకం సాధించి ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అయితే అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను ఆశ్రయించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో కలెక్టర్ లక్ష్మీశ వెంటనే స్పందించారు. క్రీడాకారుని ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, అంతర్జాతీయ వేదికపై దేశం, రాష్ట్రం, జిల్లాకు పేరు తీసుకురావాలనే ఆయన సంకల్పానికి అండగా నిలవాలన్న ఉద్దేశంతో పీ4 ద్వారా సహకారం అందేలా చొరవచూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శిగా ముందుకు వచ్చిన సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను క్రీడాకారుడికి సహాయం అందించేలా అనుసంధానించారు. ఈ మేరకు సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సమకూర్చిన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ క్రీడాకారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కృపారావు కెనడాలో జరగనున్న కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకం సాధించాలనే ఆయన సంకల్పం సాకారం కావాలని, ఆయన విజయంతో ఎన్టీఆర్ జిల్లా పేరు అంతర్జాతీయ క్రీడా వేదికపై మార్మోగాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జీఎం కె.మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల మానసిక ఆరోగ్యానికి ప్రత్యేక కార్యక్రమం

## ప్రతి గురువారం ఉచిత మానసిక ఆరోగ్య సెషన్స్.. జిల్లా కలెక్టర్ చొరవతో ఆకర్ష ఫౌండేషన్ భాగస్వామ్యంతో కార్యక్రమం



విజయవాడ: సెప్టెంబర్ 17, 2026: ఉద్యోగ విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ చొరవతో ప్రత్యేక మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం జిల్లా క్యాంపు కార్యాలయంలో ఉద్యోగుల కోసం ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు ఎదుర్కొనే పని ఒత్తిడిని గుర్తించడం, నియంత్రించడం, మానసిక సమస్యలను అధిగమించడం, పని--వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత పాటించడం వంటి అంశాలపై నిపుణులు అవగాహన, కౌన్సెలింగ్ అందించారు. ఈ కార్యక్రమానికి 'ఆకర్ష ఫౌండేషన్' భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వెంకటశంకర్ రావు ఆధ్వర్యంలో సుమారు 150 మంది సైకాలజిస్టుల బృందం ఉచిత మానసిక ఆరోగ్య సేవలు, కౌన్సెలింగ్ అందిస్తోంది. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికత, పని విధానాలకు అనుగుణంగా ఉద్యోగులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. మార్పుకు భయపడకుండా కొత్త విషయాలను నేర్చుకోవడం, కొత్త అవకాశాలను స్వీకరించడం, సానుకూల దృక్పథంతో బాధ్యతలను నిర్వహించడం అవసరమన్నారు. పరస్పర సహకారం, సమన్వయం, టీమ్ వర్క్‌తో కార్యాలయ పనితీరును మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ కౌన్సెలింగ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతి గురువారం ప్రత్యేక మానసిక ఆరోగ్య సెషన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తీవ్ర ఒత్తిడి లేదా మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు, బంధువులను కూడా ఈ సెషన్స్‌కు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వాన్స్‌డ్ కౌన్సెలింగ్, గైడెన్స్ నిపుణులు విడియాల చక్రవర్తి, సైకాలజిస్టులు డా.జి.శంకరరావు, డా.టీఎస్ రావు, శ్రీపతి జగదీశ్, సైకాలజిస్టు బి.నవితా శ్రీ, నోడల్ అధికారి జి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

## మరియు జరిమానా విధించిన నాంపల్లి గౌరవ అదనపు సెషన్స్ న్యాయమూర్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 17, 2026: ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 110/2020కి సంబంధించిన సెషన్స్ కేసు (రాజ.చీశీ. 282/2021)లో నాంపల్లిలోని గౌరవ ×ం అదనపు సెషన్స్ న్యాయమూర్తి శ్రీ జె. విక్రమ్ గారు ఈరోజు తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడైన మూడే రాజు నాయక్ (రూ−1), తండ్రి: ఎం. చంద్ర నాయక్, వయస్సు 37 సంవత్సరాలు, ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: ఎస్.వి. నగర్, తిరుపతి, ఆంధ్రప్రదేశ్ కు సెక్షన్లు 302, 379, 201 ఐపీసీ కింద నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష మరియు మొత్తం ₹16,000/- జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కేసు పూర్వాపరాలు: తేదీ 02.02.2020 న మధ్యాహ్నం 15:00 గంటలకు వికాస్‌పురి కాలనీ, ఏజీ కాలనీ సమీప నివాసి శ్రీ పి. ప్రదీప్ (28) ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఆయన తండ్రి పి. రమేష్ (50) తేదీ 01.02.2020 న సాయంత్రం 18:30 గంటలకు బోరాబండ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయలుదేరి తిరిగి రాలేదు. అదే రోజు రాత్రి 20:30 గంటలకు ఆయన స్నేహితుడు సాయి ఫోన్ చేయగా, తాను స్నేహితుడి ఇంట్లో ఉన్నానని రమేష్ తెలిపారు. మరుసటి రోజు (02.02.2020) ఉదయం 10:30 గంటలకు రమేష్ ఫోన్ నంబర్ నుండి ఆయన కోడలికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆ తర్వాత ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, శాస్త్రీయ ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు.

### కేసు వివరాలు మరియు పోలీస్ బృందం:

న్యాయమూర్తి: శ్రీ జె. విక్రమ్, గౌరవ అదనపు సెషన్స్ జడ్జి, నాంపల్లి, హైదరాబాద్

దర్యాప్తు అధికారులు: శ్రీ ఎస్. మురళీ కృష్ణ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎస్.ఆర్.నగర్ పి.ఎస్), శ్రీ వి. నరసింహారెడ్డి (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ - ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు)

డిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్: శ్రీమతి శ్రీవాణి

డిఫెన్స్ కౌన్సిల్: ఆసిఫ్ అలీ (అడ్వకేట్)

కోర్టు డ్యూటీ ఆఫీసర్: శ్రీ మన్నాటి బలరామ్ (PC 30792, ఎస్.ఆర్.నగర్ డివిజన్)

ప్రాసెస్ డ్యూటీ: శ్రీ బి. కృపేంద్ర (PC 3974)

కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, సరైన ఆధారాలను కోర్టుకు సమర్పించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, కోర్టు సిబ్బంది మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సేవలను అధికారులు అభినందించారు.

# రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక ఆళ్ల నాని

## ఆళ్ల నాని కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటాం.. ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన మంత్రి నారా లోకేష్

ఏలూరు:, సెప్టెంబర్ 17,: ఆంధ్రప్రదేశ్ ఒక మంచి వ్యక్తిని కోల్పోయిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) పార్థివదేహానికి మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. గురువారం ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేష్.. ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. "ఆళ్ల నాని మృతి బాధాకరం. ఆంధ్ర రాష్ట్రం ఒక మంచి వ్యక్తిని కోల్పోయింది. నాని అన్న మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా ఉన్నాను. సభలో అనేక అంశాలపై ఆయనతో చర్చించేవాడిని. అయితే ఏనాడూ వ్యక్తిగత విమర్శలకు వెళ్లకుండా హుందాతనంగా ఆయన వ్యవహరించేవారు" అని లోకేష్ తెలిపారు.

"రాజకీయాల్లో రాజనీతి ఉండాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆళ్ల నాని అన్న. వ్యక్తిగత దూషణలకు ఆయన ఎప్పుడూ దూరంగా ఉండేవారు, ప్రజలు మనకు ఇచ్చిన అవకాశాన్ని ప్రజల సమస్యల గురించి మాట్లాడేందుకే ఉపయోగించాలనే భావనతో ఆయన ఉండేవారు" అని చెప్పారు.

"ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా ఆళ్ల నాని సమాజానికి చేసిన సేవలు చరస్మరణీయం. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఆరోగ్య శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకోవాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి ప్రజలకు సేవ చేయాలని, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి నాని అన్న" అని పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సమయంలో తాను ఆయనతో చెప్పిన విషయాలను మంత్రి గుర్తుచేశారు. "ఐదు సంవత్సరాలుగా మిమ్మల్ని దగ్గరుండి చూసిన వ్యక్తిని. మీరు ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటే వ్యక్తి కాదు. క్రమశిక్షణ అనే పాఠశాల మీది. మీలాంటి వ్యక్తులు రాజకీయాల్లో నడుచుకునే తీరును చూసి మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలని చెప్పాను" అని లోకేష్ తెలిపారు.



అలాంటి మంచి వ్యక్తి ఈరోజు తమ మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆళ్ల నాని అంత్యక్రియలు జరుగుతున్నాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి అక్కడే ఉండి అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ తరపున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, మద్దిపాటి వెంకటరాజు, సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఏపీ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపీఎస్ఆర్టీసీ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏపీ భవన నిర్మాణ, ఇతర నిర్మాణాల కార్పొరేషన్ చైర్మన్ వలవల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



# బైరాన్‌పల్లి వీరులకు జనసేన నివాళి

**జనగామ, సెప్టెంబర్ 17**

